# ఎన్నికల కోడ్.. కట్టుదిట్టంగా అమలు

- నిరంతరం ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్‌ను అమలు చేయడంపై నగర పోలీసులు ఫోకస్ పెట్టారు. మరోపక్క సున్నితమైన పోలింగ్ స్టేషన్ల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో భాగంగా గత ఎన్నికలలో సున్నితమైన పోలింగ్ స్టేషన్ల వద్ద చోటు చేసుకున్న ఘటనలపై ఆరా తీస్తున్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలోని అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ మాత్రమే అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల అభ్యర్థులు ఎవరనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. దీంతో ఇంకా నగరంలో రాజకీయంగా అంతగా హడావిడి కనిపించడంలేదు. బీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రమే ప్రజల్లో తిరుగుతూ ప్రచారం చేసుకుంటున్నారు. సోమవారం నుంచి రాజకీయంగా వేడి పెరిగే అవకాశాలున్నాయి. ఒక్కొక్క పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించేందుకు అవకాశాలున్నాయి. దీంతో ప్రచారాలు జోరందుకుంటాయి. ఈ నేపథ్యంలోనే ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరిస్తున్నారు.



### రౌడీ షీటర్ల బైండోవర్

ఎన్నికల సమయంలో రౌడీలు, గుండాలపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇప్పటి వరకు 652 మందిని బైండోవర్ చేశారు. నగరంలో 3931 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. 1587 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా గుర్తించారు. ఇందులో భాగంగానే బందోబస్తును కూడా ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 15 నియోజకవర్గాలలో పోలీసుల నిఘా 24 గంటలు కొనసాగుతున్నది. అక్రమంగా సాగే డబ్బు, మద్యం రవాణాను అరికట్టడంతో పాటు ఆన్‌లైన్ నగదు బదిలీలపైనా నిఘా కొనసాగుతున్నది.

### ఉన్నతాధికారుల పర్యవేక్షణ..

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ నివేదికలు తెప్పించుకుంటున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ప్రణాళికలు రచించారు. ఎన్నికల కోడ్ అమలు, అనుసరించాల్సిన నియమ నిబంధనలపై ఉన్నతాధికారులు ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు రూట్ మ్యాప్ ఇచ్చారు. అదేవిధంగా.. ఎన్నికలకు సంబంధించిన విధి విధానాలపై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

## ఉద్యోగాల కల్పన దిశగా స్టార్టప్‌లు

### టీ-హబ్‌లో 'ఇండియా టెక్ టాలెంట్ లీగ్'



ఇండియా టెక్ టాలెంట్ లీగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

కొండాపూర్, అక్టోబర్ 12 : దేశంలో అత్యంత ప్రతిభాపాటవాలు, నైపుణ్యత కలిగిన యువత విదేశాల్లో ఉద్యోగులుగా స్థిరపడకుండా వారిలోని తెలివితేటలతో ఇక్కడే మరింత మందికి ఉపాధి కల్పించేలా ప్రోత్సహించేందుకు స్టార్టప్ ఫౌండేషన్‌ను స్థాపించినట్లు ఇండియా స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేఏ చౌదరి అన్నారు. గురువారం నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో నిర్వహించిన 'ఇండియా టెక్ టాలెంట్ లీగ్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నైపుణ్యత గల యువత స్టార్టప్‌లను ఏర్పాటు చేసి, ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించేలా స్టార్టప్ ఫౌండేషన్ ప్రోత్సహిస్తుందన్నారు. విదేశాలకు వలస వెళ్లి అక్కడ ఉద్యోగులుగా మారుతున్నారని, ఉద్యోగులుగా కాకుండా ఉద్యోగాలు కల్పించే వ్యక్తులుగా నిలిచేలా స్టార్టప్ ఫౌండేషన్ ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీ-హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు, ది గ్రేట్ ఇండియన్ లాఫ్టర్ చాలెంజ్ చాంపియన్ విఘ్నేష్ పాండే, ఇఫిన్ గ్లోబల్ గ్రూప్ చైర్మన్, సీఈఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

### భారతీయ విద్యార్థులు..

## అవగాహన లేకే.. తిరిగొస్తున్నారు

### అమెరికా మెర్సీ యూనివర్సిటీ హెడ్ శిల్పా మిశ్రా



సదస్సులో మాట్లాడుతున్న అమెరికా మెర్సీ యూనివర్సిటీ హెడ్ శిల్పా మిశ్రా

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 12: విదేశీ యూనివర్సిటీలలో విద్యను అభ్యసించేందుకు వెళ్తున్న చాలా మంది విద్యార్థులకు సరైన అవగాహన లేక తిరిగి వచ్చేస్తున్నారని అమెరికా మెర్సీ యూనివర్సిటీ హెడ్ శిల్పా మిశ్రా అన్నారు. గురువారం నగరంలో నిర్వహించిన మెర్సీ యూనివర్సిటీ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధానంగా భారతీయ విద్యార్థులు విదేశీ యూనివర్సిటీలలో విద్యను అభ్యసించాలంటే తప్పని సరిగా ఇంగ్లిషులో పట్టు సాధించాలన్నారు. మెర్సీ యూనివర్సిటీ న్యూయార్క్‌లో 1950లో ప్రారంభమైందన్నారు. అమెరికాలో ఈ యూనివర్సిటీకి ఎన్నో శాఖలు ఉన్నాయన్నారు. ఈ యూనివర్సిటీలో 54 దేశాలకు చెందిన 12 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. మెర్సీ యూనివర్సిటీ ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గ్రూపు విద్యార్థులకు డిజిటల్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ కోర్సులలో ఆన్‌లైన్ అకాడమిక్, ఒకేషనల్ కోర్సులలో దిశా నిర్దేశం చేస్తున్నదని తెలిపారు. మెర్సీ యూనివర్సిటీ గ్లోబల్ డైరెక్టర్ ఎన్డీ బరష్ట్ మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు నేటి కాలానికి ఎంతో అవసరమన్నారు.

## ఎన్నికల నోడల్ అధికారుల నియామకం

### జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ ): అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించి, వారికి బాధ్యతలు అప్పగించామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. శానిటేషన్ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆర్.ఉపేందర్ రెడ్డి పవర్ నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ ఈవీఎం, వీవీ ప్యాట్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా, రీజనల్ ఫైర్ ఆఫీసర్ ప్రసన్నకుమార్ ట్రాన్స్‌పోర్టు మేనేజ్‌మెంట్, జాయింట్ కమిషనర్ జయంత్ రావు మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి ఎంసీసీ నోడల్ అధికారిగా నియమించారు. పోలీస్ అడిషనల్ కమిషనర్ విక్రం సింగ్ మాన్‌ను లా అండ్ ఆర్డర్, జిల్లా సెక్యూరిటీ ప్లాన్ నోడల్ అధికారిగా నియమించారు. ఖైరతాబాద్ జోన్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వి.శరత్‌చంద్ర ఎక్స్‌పెండిచర్ మానిటరీ నోడల్ అధికారిగా నియమించారు. జీహెచ్ఎంసీ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మహమ్మద్ అలీ ముర్తూజా మీడియా, కమ్యూనికేషన్ నోడల్ అధికారిగా నియమించారు. అడిషనల్ కమిషనర్ ఎస్టేట్ గీతా రాధిక ఐటీ రిలేటెడ్ నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. డిప్యూటీ కలెక్టర్లు పద్మప్రియ, అర్చన, శ్రీకాంత్ రిపోర్ట్ అండ్ రిటైన్స్ నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ ఆర్.సత్యనారాయణ రెడ్డి బేసిక్ మినిమం ఫెసిలిటీస్ నోడల్ అధికారిగా, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ హెల్త్ కేర్ ఆఫ్ పోలింగ్ పార్టీ అండ్ ఎలక్టర్స్ నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. పర్సనల్ ఆఫీసర్ ఎస్‌డబ్ల్యూఎస్ విజయభాస్కర్ రెడ్డిని బ్యాలెట్ పేపర్ నోడల్ అధికారిగా, జాయింట్ కమిషనర్ అలివేలు మంగతాయారును ఎలక్ట్రోరోల్స్ నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. స్పోర్ట్స్ డైరెక్టర్ భాషా ఫిర్యాదులు, పరిష్కారం విభాగానికి నోడల్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ ఉత్తర్వులు జారీ చేశారు.

## 15 రోజుల్లో.. 105 మంది ఆకతాయిల అరెస్ట్

### కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): పదిహేను రోజుల్లో 105 మంది ఆకతాయిలను పట్టుకున్నట్లు రాచకొండ షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ వెల్లడించారు. బస్టాండ్లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, విద్యా కేంద్రాలు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ డెకాయి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, మహిళలను వెంబడిస్తూ వేధించే పోకిరీలను సాక్ష్యాధారాలతో పట్టుకుంటున్నామన్నారు. అనంతరం వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరుపరుస్తున్నామన్నారు. ఇటీవల అరెస్టు చేసిన 105 మందిలో 58 మంది పెద్దలు, 47 మంది మైనర్లు ఉన్నారని, వారికి ఎల్బీనగర్ సీపీ క్యాంప్ ఆఫీస్‌లో మహిళా భద్రత విభాగంలో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు వివరించారు. కాగా, సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు 81 ఫిర్యాదులు అందాయని, అందులో వాట్సాప్(21), సోషల్ మీడియా యాప్స్(19), నేరుగా వచ్చినవి 17 ఉన్నాయని తెలిపారు.

### కొన్ని ప్రధాన కేసులు

- 10వ తరగతి చదువుతున్న బాలికను పరిచయం చేసుకొన్న ఆమె దూరపు బంధువు మాయ మాటలు చెప్పాడు. పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను లోబర్చుకున్నాడు. ఆమెకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్ చేయడంతో బాధితురాలు షీ టీమ్స్‌ను ఆశ్రయించింది. దీంతో ఉప్పల్‌లో నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.
- మహేశ్వరం ప్రాంతానికి చెందిన అక్కచెల్లెళ్లకు ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర ఫొటోలు పంపి.. బ్లాక్‌మెయిల్ చేస్తున్న వారిపై బాధిరాలు ఇబ్రహీంపట్నం షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేశారు. మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.
- బీర్ సీసాలు పట్టుకొని మద్యం మత్తులో చౌటుప్పల్‌లోని మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థినులను వేధిస్తున్న ఇద్దరిపై చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

## బండా ప్రకాశ్‌ను విమర్శిస్తే సహించం

- ఆయనకు పదవులు సీఎం కేసీఆర్ కేటాయించారు
- ప్రతిపక్ష నేతలు అసత్యపు ప్రచారాలు మానుకోవాలి
- తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్

ఖైరతాబాద్, అక్టోబర్ 12 : 'తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్‌కు పదవి ఎవరో పైరవీ చేస్తే వచ్చిందనడం అబద్ధం.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన పనితనం, కష్టపడే తత్త్వాన్ని గుర్తించి ఇచ్చారు'.. అని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్‌కు రాజ్యసభ పదవి తానే ఇప్పించినట్లు ఇటీవల జరిగిన ముదిరాజ్‌ల సభలో ఓ ప్రతిపక్ష నేత చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. లక్షలాది మంది ముదిరాజ్‌లకు డాక్టర్ ప్రకాశ్ ఆశాదీపంగా నిలిచారని, ఆయన ముదిరాజ్‌ల సంక్షేమానికే పాటుపడ్డారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా కావాలంటే 38 మంది ఎమ్మెల్యేలు ఓట్లు వేయాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనను స్వయంగా రాజ్యసభకు ఎంపిక చేశారని, దీని వెనుక తానే పైరవీ చేసినట్లు ఆ ప్రతిపక్ష నేతలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలోని ముదిరాజ్‌లందరూ డాక్టర్ బండా ప్రకాశ్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వెన్నంటి ఉంటారన్నారు. ప్రతిపక్ష నాయకులు దిగజారుడు మాటలు మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లుడు జగన్, సమన్వయ కర్త బొక్క శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అద్యక్షులు తలారి మల్లేశ్, రాష్ట్ర కార్యదర్శి గుండెమోని అంజయ్య, మహిళా అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి పాల్గొన్నారు.

## నేడు బాగ్ లింగంపల్లిలో 'సుద్దాల' జాతీయ పురస్కారం

చిక్కడపల్లి, అక్టోబర్ 12: సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుద్దాల హనుమంతు – జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవాన్ని బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్ తేజ తెలిపారు. ఈ జాతీయ పురస్కారాన్ని అరుణోదయ విమలక్కకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి, ప్రజా నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు చింతకింది కాశీం, ప్రముఖ రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి, కోయి కోటేశ్వర రావు, మోదుగుపూలు సంపాదకులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రముఖ నటుడు ఉత్తేజ్, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

## తిరిగి చెల్లించండి

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): స్థల విక్రయ కేసులో కొనుగోలుదారుడికి 12 శాతం వడ్డీతో కలిపి రూ.37లక్షల 70వేలు రీఫండ్ చేయాలని 'వెజె రియల్టర్స్ అండ్ బిల్డర్స్' కంపెనీకి రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. కొనుగోలు చేసిన ల్యాండ్‌ను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనందుకు రూ.లక్ష నష్టపరిహారంగా అందజేయాలని పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ పేర్కొన్న వివరాల ప్రకారం.. సోమాజిగూడలోని ఎర్రమంజిల్‌కు చెందిన ఎం.శ్రీనివాసరావు బెంగళూరు రూరల్ జిల్లా, దేవనహల్లి తాలుక, శత్తరహల్లిలోని సర్వే నంబర్ 93లో 10గుంటల స్థలాన్ని కొనుగోలు చేశాడు. మొదటి విడతలో రూ.9,42,500, రెండోసారి రూ.25లక్షలు, మూడోసారి రూ.3,27,500 చెల్లించారు. అయితే, రియల్టర్ సంస్థ అగ్రిమెంట్‌ను ఉల్లంఘించి కొనుగోలుదారుకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వలేదు. దీంతో కొనుగోలుదారుడు రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో కేసు వేయడంతో కమిషన్ విచారించింది. 12 శాతం వడ్డీతో కలిపి ల్యాండ్ కొనుగోలుదారుడికి డబ్బు చెల్లించాలని రియల్టర్ సంస్థను ఆదేశించింది. కోర్టు ఖర్చుల కింద మరో రూ.50వేలు ఇవ్వాలని కోరింది.